కథా నిలయం
1095
శ్రీకాకుళం

# పరిణామం

డాక్టరుగారికి ఎదురుగా కూర్చుని ఏదో మాటాడుతూ ఉండగా పక్క గదిలోనుండి క్రొత్తగొంతు వినపడింది.

ఎందుకో ఆసక్తి కలిగింది.

ఎక్కడో విన్నట్లే ఉన్నదని అనిపించింది కూడానూ.

ఓసారి అలా తొంగిచూద్దామని అనిపించింది. కాని సభ్యత కాదని ఆ ప్రయత్నమదీ మానేశాను.

ఆ మాటాడుతున్నది ఎవరైనా క్రొత్తగా మందు కోసం వచ్చినవారు కావచ్చు. కాక డాక్టరుగారి బంధువు కావచ్చును. అదీ కాకపోతే మరెవరైనా డాక్టరమ్మ కావచ్చు. అకారణంగా పరాయివాడు పనివేళావచ్చి తొంగిచూస్తే ఆమె ఏమైనా అపార్థం చేసుకోవచ్చును. ఆమె కాకపోతే డాక్టరు గారే ఏమైనా అనుకోవచ్చును.

ఇల్లా మరికొన్ని క్షణాలు అనుమానాల్లో పడ్డాను. ఎదుట డాక్టరుగారు మాటాడుతూనే ఉన్నారు. ఇవతల

నేనేమేమో ఆలోచిస్తూనేఉన్నాను. మొదట్లో ఆయన నాధోరణి పసికట్టలేదు కాని నేను కొంచెం పరధ్యానంగా ఉన్నట్లు అనుమానం కలిగి కాబోలు "ఏమిటి" అన్నట్లు నావంక చూచారు? అబ్బే ఏమీలేదంటూ తల ఆడించి కళ్ళతోనే సమాధానం చెప్పుకొన్నాను. అలా ఆయన్ను సమాధాన పరుస్తుండగా మళ్ళీ ఇందాక విన్న గొంతు వినిపించింది. ఈసారి వినపడగానే ఏదో చప్పున స్ఫురణకు వచ్చినట్లే వచ్చి అంతలో మనస్సులోనుండి ఆస్మృతి జారిపోయింది. నేను కొంచెం తికమకపడ్డాను.

"ఇంత మతిమరుపు వచ్చిందేమిటి ?" అనుకొని విసుక్కొన్నాను,

ఈసారి ఆయన నా సంగతి పట్టేశారు. తన మాటలు వినక నే నేదో ఆలోచనలో పడిపోయానని తెలుసుకొన్నారాయన.

"ఏమిటీ ఆలోచన—ఆ—ఏమిటో చెప్పరాదూ ?" అన్నారాయన.

అసలువిషయం చెప్పేస్తే తీరిపొయ్యేది. చెప్పానుకాను. పోనీ చెప్పేద్దామని అనిపించి, కాస్త తటపటాయించిన రెండు క్షణాల తర్వాత "నిజమే చెప్పకపోవడమే మంచిదైంది" అనిపించింది. అవును. ఆయన అసలే అనుమానపు మనిషి. నాకంటె వయస్సుచేతా, విద్యవలనా, చాలకాలం పదిమందిలో తిరగడంవలన గడించిన అనుభవంచేతా పెద్దవాడు. ఇట్టే

అపార్థం చేసుకొని కేకలేసే స్వభావం కూడా ఉన్నది. అనవసరంగా చీవాట్లు తినవలసి వస్తుందేమోనని భయంవేసింది. అందుకే ఆ విషయం వెంటనే కాకపోయినా తర్వాతనైనా ఆయనతో చెప్పలేకపొయ్యాను.

నిజానికి నాకా గొంతు పరిచతమైందే. బహు స్పష్టంగా విన్నదే. కాని ఆ స్త్రీని సరిగ్గా ఎక్కడ ఎప్పుడు ఎందుకు కలుసుకొన్నానా అన్నదే స్ఫురణకు రావడంలేదు. "నాకు బాగా పరిచయమున్నగొంతే సుమండీ"అని ఆయనతో చెప్పేసి తీరా ఆయన "అబ్బే! అదా ఒట్టి.... మనిషి. మందుకోసం వచ్చింది. దాంతో నీకెల్లా పరిచయం? నువ్వేమో బుద్ధిమంతుడ వనుకొంటున్నా నువ్విలాంటి పరిచయాలు కూడా చేసుకొంటున్నావా? ఆఁ." అని అనేస్తే ఇక నేను అప్పు డేమని సమాధానం చెప్పుకోవాలి? అకారణంగా అత్యంత క్లిష్టపరిస్థితి కొనితెచ్చుకోవడమే కాని మరోటికాదు. ఇల్లా అనుకొని అసలు విషయం బయట కేమాత్రమూ పొక్కనీయకుండా "అబ్బే ఏమీలేదండీ! ఈపూట అర్జెంటుగా ఊరు వెళ్ళవలసి ఉన్నది. ఆ విషయం జ్ఞాపకం వచ్చింది. వెళ్ళడమా మానడమా అని — ఎటూ తేలక కొంచెం ఇదవుతున్నాను" అనేశాను.

"అదా సంగతి. ఎందుకు వెళ్ళాలో చెప్పు. నీ పిచ్చి సమస్య నేను వెంటనే పరిష్కరించేస్తాను. అయినా చూశావూ! ఒక విషయం ఎప్పుడు జ్ఞాపకం ఉంచుకో. కొన్ని విషయాలను

గురించి మాత్రమే తీవ్రంగా ఆలోచించాలి. ప్రతి చిన్న విష యాన్నీ సమస్యగా తయారు చేసుకోకూడదు. కొంతమంది స్నానం చెయ్యడమా మానడమా అని గంటల తరబడి బహు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. అది ఒక విధమైన మానసిక దౌర్బ ల్యం కిందికి వస్తుంది. అల్లాంటి స్వల్ప విషయాలు అభ్యాస వశాన యంత్రవతుగా జరిగి పోవాలి. ఆలోచనా శక్తిని మరింత ప్రధానమైన అంశాలకు మాత్రమే వినియోగించాలి" అని చెబుతూ ఎందుకో ఒక్క క్షణం ఆగారు. ఏదో స్ఫురణకు వచ్చినట్లున్నది.

"వెనకటికి ఒకమ్మాయి వానలో ఇంటికి వచ్చింది. బట్టలు తడిసిపొయ్యాయి. పొడిబట్టలు వేసుకొందామా వద్దా అని ఆలోచనలో పడ్డది. ఇందాకనే కదా. ఇస్త్రీ బట్టలు వేసు కొన్నది కాస్తంత తడిస్తేమట్టుకూ అప్పుడే విప్పేయడమా, కాని విప్పకపోతే జలుబుచేస్తుందేమో!" అని తర్కించు కొన్నది. ఆలోచనలో పడ్డది. ఆ సాయంత్రిందాకా ఆమెకా ఆలోచన తెగలేదు. చీరా, రవికా వంటిమీదనే ఆరిపొయ్యాయి. అరెరె! పొడిబట్టలు వేసుకోకపోతినే అని తపనపడ్డది. ఆ రాత్రే జ్వరమూ వచ్చింది. మర్నాడు ఇక్కడకు మందుకూ వచ్చింది. ఇంతకూ ఇది ఎందుకు చెప్పానంటే— అవును—స్వల్ప విష యాలను గురించి అంతచేటుబాధ పడకూడదు. సరేగాని ముందా పనేమిటో చెప్పు" అన్నారు డాక్టరుగారు.

చెప్పక తప్పిందికాదు. అందులోనూ అప్పటికప్పుడూ కల్పించి. "మిత్రుణ్ణి కలుసుకోడానికండీ!" అన్నాను చివరకు.

"అతను నీకు ముఖ్యుడా ? ఆ మాట్లాడవలసిన విషయం అంతముఖ్యమయిందా ?"

"అతనంత ముఖ్యుడూ కాదు .... విషయమూ అంతే ననుకోండి...."

"అయితే ఇంకేం మరి మానేసెయ్" అని చప్పున తేల్చేశా రాయన.

"కాని అల్లా వీల్లేదండీ అతను చాలా నొచ్చుకొంటాడు. బాల్య స్నేహితుడు" అనీ మొదలుపెట్టి ఇక అబద్ధాల గొలుసు కట్టు అల్లుకొని పోతున్నాను. ఎందుకు వెళ్ళాలో, వెళ్ళక పోతే ఏమి ఇబ్బందో, కాని వెళ్ళడానికి ఉన్న అవరోధా లేమిటో చెప్పుకొనిపోతున్నాను.

అంతలో మళ్ళీ అదే గొంతు విన్పించింది. ఆ వ్యక్తి గుమ్మానికి అవతలగా, పరదా వెనుకనుండి మాటాడుతున్నది ఎవరితోనో. రెండు క్షణాల తర్వాత "డాక్టరుగారూ! మీరు ఓసారి ఇలా వస్తారూ ?" అని అడిగిందా వ్యక్తి. ఆ మాటలు నాకు స్పష్టంగా వినిపించాయి.

నాజూకుగా మాటాడడము క్రొత్తగా నేర్చుకొన్న ట్లుగా తెలుస్తూనే ఉన్నది. కొద్దికాలం క్రిందటివరకూ ఆమెకు సహజంగా ఉంటూవచ్చిన యాస జాగ్రత్తగా వింటే ఇప్పటికీ

కన్పిస్తూనే ఉన్నది. అంతలో మళ్ళీ ఇందాకటిలా మనస్సులో మెరపులా ఏదో స్మృతి మెరిసింది. మనోవీథి అంతటా ఒక్కసారి వేయి విద్యుద్దీపాలు వెలిగి ఆరిపోయినట్లయ్యింది. వెంటనే దృష్టి అంతా అటు మరల్చి దాన్ని దృఢంగా పట్టేసుకొన్నాను. అప్రయత్నంగా "యస్ యు అర్ రైట్" అనేశాను. వెధవది అభ్యాసంలో అంత దృఢంగా నాటుకొని పోతోంది ఆంగ్లభాష. చదువుకోవడం, మాటాడుకోవడమే కాకుండా ఆలోచించడం, ఇంకా మాటాడితే కలవరించడం కూడా పరభాషలోనే. ఇంత అన్యాయమా! ఈ విషయమై డాక్టరుగారు ఒక అరగంట ప్రసంగించ గలరు. కాని నా అదృష్టవశాత్తు ఆయన ఈవిషయం పట్టించుకోలేదు. కాని "ఏమిటి? ఏ విషయం?" అని మాత్రమే అడిగారు.

"అదేనండీ! మీరు ఇందాక చెప్పారే. స్వల్పవిషయాలను గురించి అనవసరంగా ఆలోచించకూడదని ఆ విషయం."

"సరే అయితే గురికుదిరిందన్నమాట." అని ఒక్కక్షణం ఆగి "ఇప్పుడే వస్తానుండు" అంటూ ఆయన లేచి స్టెతస్కోపు మెడలో తగిలించుకొని ప్రక్క గదివైపు వెళుతూ, "కనుక నీవు వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేయగలవన్న మాటేగా?" అన్నారు. అని పరదా తొలగించుకొని లోపలకు వెళ్ళారు.

కాని నేను అబద్ధమాడాను. నేను ఆ మాటల అనుకొన్నదీ—అన్నదీ వారు చెప్పిన విషయమైకాదు. ఆ గొంతు నేను ఎక్కడ విన్నదీ స్పష్టంగా గుర్తునకువచ్చి అన్నమాటలవి.

"అవును. ఆ గొంతు ఆరోజు నేను—అవునా ఊళ్ళో విన్నాను, అర్ధరాత్రి..." అనుకొన్నాను. గుమ్మం అవతల డాక్టరు గారితో ఆమె ఏమో నెమ్మదిగా చెబుతున్నది. "ఆహా అల్లాగా అయితేసరే—సామాన్లన్నీ సిద్ధం చేశావన్నమాట — మంచిది మంచిది" అంటున్నారు డాక్టరుగారు. ఆమె మళ్ళీ రోగి కేదో చెబుతున్నది.

ఆమె విషయం ఇప్పుడు నిర్ధారణ అయ్యింది. కాని జ్ఞాపకం రావడానికి ఇంతసేపు పట్టవలసిందికాదు. నాలుగయిదు ఏళ్ళు గడచిపోవడం మూలంగానూ, నాకు కొంత మతిమరుపు ఉండడము కారణంగానూ ఇంత ఆలస్యమైంది. ఏదో స్టేషన్లో ప్లాటుఫారంమీద నిల్చుని రైలుబండిలోనుండి ఎవరో ఎవరితోనో మాటాడుతుండగా విని ఆ తర్వాత ఆ గొంతు పోల్చుకోలేక పోయ్యానూ అంటే ఏమైనా అర్థముంది కాని అక్కడ ఏకాంతంగా తాపీగా అంతసేపు సంభాషణ జరిగాక ........ వట్టి సంభాషణేనా!

ఆరోజు రాత్రి.

వేటపాలెంలో బండి తప్పింది. ఒక్క పదినిముషాల్లో తప్పిపోయింది. అకారణంగా నేనే ఆలస్యం చేశాను. ప్రియ మిత్రుణ్ణి చూచివద్దామని, అతనితో అత్యావసర విషయాలేవో మాటాడివద్దామని బయలుదేరి వెళ్ళి, రాత్రి పదిగంటలకు స్టేషన్లో బండి దిగి అతని ఇంటికి వెళ్ళాను. కాని తలుపు తాళం వేసి ఉన్నది. ఆపళంగా వెంటనే స్టేషనుకు వచ్చేస్తే బండి లక్షణంగా అందేది. సినిమాకు వెళ్ళాడేమోనని హాలుకు వెళ్ళి అక్కడ

లేకపోతే మళ్ళీ ఇంటికి వచ్చాను "తాళంపెట్టి వెళ్ళాడే ఎక్కడకు వెళ్ళాడు చెప్మా" అని ప్రశ్నించుకుంటూ. "పోనీ అతను వచ్చేదాకా ఈ వరండాలోనే పడుకొందామా ఏమిటి ?" అని ఆలోచనలో పడి బెడ్డింగువిప్పి, ఈ కాసేపటికి బెడ్డింగు విప్పడం కూడా దేనికని యథాప్రకారం చుట్టి, ఏమో అతను గ్రామాంతరం వెళ్ళాడేమో, పోనీ వచ్చిన దారినే వెళ్ళిపోదామా ఏమిటి ? అనుకొని ఎటూ తేలక సతమతమవుతూ గంటసేపు వృధా కాలయాపన చేసిన తర్వాత దారినపొయ్యే పెద్దమనిషి "ఆయనకు బదిలీఅయి వెళ్ళిపోయారండీ" అని చెబితే అప్పుడు బయలుదేర స్టేషనుకు వచ్చాను.

అవును ఆ పూటకలిగిన అనుభవం ఎట్లాచూచినా మరచిపో తగిందికాదు,

స్టేషనుకు వస్తుండగా దారిలోనే చినుకులు పడడం ఆరంభమైంది. వాన పెద్దదై తడిసిపోతానేమోనని రిక్షావాణ్ణి ఆపి, టాపువేయించి, తెర ఒకటి కట్టించుకొన్నాను. కాని ఏం లాభం బండికాస్తా తప్పిపోయింది. సరిగ్గా బండి స్టేషను వదలి వెళ్ళిన పది నిముషాలకు నేను అక్కడకు చేరుకొన్నాను. కనీసం దారిలో ఆలస్యం చేయకుండా వచ్చినా బండి అంది ఉండేది సుమా అని ఎంతో నొచ్చుకున్నాను.

నా తెలివితక్కువతనానికీ, అనవసరపు నా అనుమానాలకూ, నా మందకొడితనానికీ నన్ను నేనే నిందించుకొన్నాను.

స్టేషనులోపలకు వెళ్ళి వాక బుచేసి వచ్చాను. కచేరి గది తాళంవేసి పోతున్న స్టేషను మాస్టరుగారు మళ్ళీ మూడుగంటల దాకా బండి లేదన్నారు. "ఏంచెయ్యాలి అప్పటిదాకా. అందులోనూ ఇల్లాంటి చిన్న స్టేషన్లో. పైగా అర్ధరాత్రిప్పుడు. అందులోనూ వర్షంలో. పోనీ వెనక్కు వెళ్ళితేనో! వెళితేమాత్రం ప్రయోజనం? అక్కడయినా ఒంటరిగా వరండాలో పడుకోవద్దూ? జల్లు లోపలకురాదని నమ్మకం ఏమిటీ? అదీకాక మళ్ళా మూడు గంటలకు మెలుకువ వస్తుందా? ఒకవేళ వస్తేమట్టుకూ ఆ వేళప్పుడు నే నీ బెడ్డింగు పుచ్చుకొని స్టేషను చేరుకోవడ మెల్లా? నాకు తోడు ఓ బెడ్డింగుకూడానూ! ఓ పూటలో తిరిగివచ్చే భాగ్యానికి ఇంత పెద్ద బెడ్డింగు ఎందుకు తేవాలీ? కాదయ్యా ఇప్పుడు వెళ్ళాలనే అనుకొందాము—వెనక్కి వెళ్ళేందుకు రిక్షాలేవీ? ఏం చెయ్యడ మిప్పుడు?" అన్నీ సమస్యలే. వెధవ ప్రశ్నలు—వెధవ ప్రశ్నలు. నన్నూరికే ఊపిరపెట్టి ఎటూ తోచకుండా చేశాయి.

చివరకు ఏ నిర్ణయానికీ రాకుండానే ఖాళీగా ఉన్న బల్ల మీద ఒక మూలగా పరుపుచుట్ట పెట్టుకొని దానిపైన నడుమానించి, కాళ్ళు జాపుకొని విశ్రాంతిగా పడుకొన్నాను. పైనున్న ఉత్తరీయం ఒళ్ళంతా కప్పుకొని. "పోనీ కాసేపు నిద్రపోతే వచ్చిన ప్రమాద మేమీ లేదుకదా" అని ప్రశ్నించుకొన్నాను. "అంత అర్జంటుగా ఊరువిడిచి పోయేవాడు నాకు కాస్త

ఓ టెలిగ్రాం ఇస్తే ఏంపోయిందీ? ఆ మాత్రం తెలియక్కర్లేదా ?" అనుకొంటూ మిత్రుడిమీద విసుక్కున్నాను. అల్లా విసుక్కొంటూ నిద్రపోదామని ప్రయత్నం చేస్తూ బయటకు ప్రకృతివైపు చూచాను.

ఇంకా సన్నగా వర్షం పడుతూనే ఉన్నది. చక్కని వెన్నెల. వెన్నెల కురుస్తున్నట్లున్నదా అనిపిస్తున్నది. చంద్రుడు వానలో కరిగిపోతున్నాడా అనిపించింది.

ప్రకృతి ఎంతో మనోహరంగా నిశ్చలంగా ఉన్నది. మధ్యమధ్య గాలి వీచినప్పుడు చెట్లు బద్ధకంగా కదులుతున్నాయి. ప్రాంగణ మైవిరుపుల్లాఉన్నా యా కదలికలు. దూరంగా ఉన్న ఇసుక దిబ్బలు మంచుగుట్టల్లా కన్పిస్తున్నాయి.

నన్ను ఇందాక కొంతసేపు చీకాకు పరచిన వెట్టిమొట్టి ప్రశ్నలన్నీ ఎక్కడివక్కడ మాయమయ్యాయి.

ఇంక ఏం చేద్దామన్న ప్రశ్నే లేదు.

"ఈ ప్రకృతిని పరిశీలిస్తూ ఆనందంగా కాలం గడపవచ్చును- ఎంతసేపైనా సరే" అని అనిపించింది. నేను నెమ్మదిగా లేచివెళ్ళి కటకటాల దగ్గర నిల్చున్నాను బయటకు చూస్తూ. అల్లా చాలాసేపు నిలబడిపొయ్యాను.

అంతలో వర్షం బాగా పెద్దదయింది. గాలి అకస్మాత్తుగా విజృంభించింది.

మొక్కలూ, చిన్న చిన్న చెట్లూ తలలు తెగ ఆడిస్తు న్నాయి. పంతులు లేని ప్రాథమిక పాఠశాలా తరగతి పిల్ల ల్లాగా గంతులు వేస్తున్నట్లున్నా యవి. కాస్త దూరంగా విశ్రాంతిగా ఉన్న మర్రిచెట్టు తలపాగా చుట్టుకొని కాస్త హుందాగా నిలబడ్డ ప్రధానోపాధ్యాయుడులా కన్పిస్తున్నది.

ఈ దృశ్యంకూడా నా హృదయాన్ని ఆకర్షించింది. మరి కొంత సేపటికి వాన పెద్దదయింది. గాలి మరీ వెఱ్ఱిగా వీయడం మొదలుపెట్టింది. స్టేషనుకు వందగజాల దూరంలో ఉన్న తాటాకు పాకలనుండి ఆకులు లేచివచ్చి ప్లాటుఫారం మీదపడి గాలి మరల మరల వీచినప్పుడల్లా ఎగిరి పడుతున్నాయి. నేను నిల్చున్న రేకులషెడ్డు నిర్జనంగా ఉన్నది. షెడ్డులోనే ఉన్న బడ్డీదుకాణమువాడు కొట్టుకు తాళం పెట్టి ఎప్పుడు వెళ్ళిపొయ్యాడో నేనసలు గమనించనేలేదు. వాన చినుకులు పైన రేకుమీద పడుతూ పెద్దశబ్దం చేస్తున్నాయి.

నేను ఆశబ్దం వింటూ, బయటకు చూస్తూ చాలా సేపు నిలబడి, వెనుదిరిగి వచ్చి బల్లమీద యథాప్రకారం పడుకొన్నాను. కాస్త సిగరెట్టు అలవాటున్నా బాగుండేది సుమా అనుకొన్నాను. కాని అంతలో అట్టి దురభ్యాసం మూలంగా కలుగగల దుష్ఫలితాలూ, ఇబ్బందులూ ఒక్కసారి జ్ఞాపకం వచ్చి చివరకు "అల్లాంటి అభ్యాసాలు ఎవరో దొరలకూ, నవాబులకూ సరి పోతాయి కాని నాలాంటి వాళ్ళకోసం కాదు" అనుకొని

సర్దిచెప్పుకొని ఇక నిద్రపోతే ఏ ప్రశ్నా రాదు అని నిద్రకు ఉపక్రమించాను.

కాని నిద్ర రాలేదు.

దూరంలో! మఱ్ఱిచెట్టు క్రిందనుండి ఎవరో మనిషి వస్తున్నట్లుగా కన్పించింది. ఒక చిన్న పెట్టె ఒకటి చంకన పెట్టుకొని. తీరా పెద్దదగ్గరకు వచ్చేదాకా ఆ వచ్చిన మనిషి స్త్రీ అని పోల్చుకోలేకపోయ్యాను. ఒళ్ళంతా మాసిన దుప్పటి ఒకటి కప్పుకొని వచ్చింది.

ఎవరో ముసిల్దిలే ఇక వెధవ ప్రశ్నలన్నీ వేసీ. పొగాకు పెట్టమనీ అనవసరంగా చికాకు కలిగిస్తుందని ఉత్తరీయం ముఖం మీదకు లాక్కొని నిద్ర నటించాను.

ఆ వ్యక్తి లోపలకు వచ్చింది.

మెట్టెలు చప్పుడవుతున్నాయి.

నెమ్మదిగా బడ్డీకొట్టు ప్రక్కకు వెళ్ళింది. వద్దువద్దు అనుకొంటూనే గాజుల చప్పుడుబట్టి ఆమె ఉనికినీ, ఆమె గమనాన్నీ కనిపెడుతూనే ఉన్నాను. పెట్టె నేలమీద ఈడ్చిన చప్పుడయ్యింది. నేను ఎడమచెయ్యి బెంచీమీద ఒత్తిపెట్టి, మెడ ఎత్తి అటువైపు చూచేసరికి ఆమె పెట్టెతెరచి చీర తీసుకొంటున్నది.

గుడ్డి వెల్తురులో ఆమె కన్పించింది.

మహాచెడ్డ ఆసక్తి కలిగించింది.

అధే కాస్త వయస్సుమళ్ళిన మనిషైతే ఏమాత్రమూ అసక్తి కలుగకపోను. నేను అదే స్థితిలో ఉండి నిశ్శబ్దంగా ఆమె ఏమిచేస్తున్నదా అని పరిశీలించాను.

దుప్పటి కప్పుకొని వచ్చినా బట్టలు బాగా తడిసిపోయి నట్లున్నాయి. పెట్టెలోనుండి పొడిబట్టలు తీసుకొన్నది.

బట్టలు తడిసిపోవడంవలన ఆమె దేహ సౌష్ఠవం దూరం నుండి కూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది.

పరస్త్రీవస్త్రధారణ.

మనసు విచలితమైంది. ఆమె నా వ్యవహారం కాస్తా కనిపెడుతుందేమో నని భయం, ఏదో పెద్ద అమూల్యమైన అవకాశం చెయ్యి జారిపోతుందేమోనని ఆపుకోలేని ఆందోళన—ఆరాటం, ఎందుకో చెప్పలేను.

నెమ్మదిగా అటువైపే తిరిగి పడుకొని ఒకవేళ ఆమె నా వంక చూచినా నేను నిద్రపోతున్నట్లు భ్రమపడేలాగున కుడిచెయ్యి నుదుటిమీద వేసుకొని నటన మొదలుపెట్టాను.

నిజమే నేను సరిగ్గానే ఊహించాను, ఆమె అక్కడే నావంకే చూస్తూ నిలుచున్నది. అడుగులో అడుగు వేసు కొంటూ నావైపుగా కొంత దూరం వచ్చి, నాకు నాలుగయిదు అడుగుల దూరంలో నిలిచి నన్ను పరిశీలించింది. ఆమెకు ఈ విషయంలో అనుమానం నివృత్తి కావడానికి అదనంగా ఏమి చేద్దామా అన్న ఆలోచనలో ఒక్క క్షణం సతమత

మయ్యాను. గురక పెడదామా అని ఒక ఆలోచన వచ్చింది కాని అంతకంటె తెలివితక్కువ పని మరొకటి ఉండబోదని వెంటనే స్ఫురణకు వచ్చింది. ఈ సందర్భాన్నే పురస్కరించు కొని చెప్పే కథ ఒకటి – ఎప్పుడో చిన్నప్పుడు విన్నది — జ్ఞాపకం వచ్చి నాలో నేను నవ్వుకొన్నాను.

ఇంకా నయం పెద్దగా నవ్వానుకాను.

ఆమె మరో క్షణం అల్లాగే నిలబడి నమ్మకం కలిగింది కాబోలు నెమ్మదిగా వెనక్కు వెళ్ళి పొడిచీర అందుకొన్నది.

ఒక్క నిముషం ఊపిరి బిగపట్టుకొన్నాను.

ఆసక్తి మహా ప్రవాహం ఒక్కసారి ఆగిపోయింది. ఒక్క సారి మెరుపులా మెరిసింది సౌందర్యం – .... సౌందర్యం! నవయౌవన వయోవిలాసం. పైగా అక్కడ ఇంకెవ్వరూ లేక పోవడం.

ఒడలు పులకరించింది.

మనసు కలవరించేసింది.

ఆమె చీర మార్చుకోవడం పూర్తికావస్తున్నది. ఒక సారి అలా గుండ్రంగా తిరిగి పమిట విసురుగా వేసుకొన్నది. సౌందర్య రేఖావలయాలు నామీదకు దాడివస్తున్నాయా అని పించింది. అవి నన్ను చుట్టేసుకొంటున్నాయా అనిపించింది. ఆమె నావైపే తిరిగి రవిక ముడివేసుకొన్నది. ఎంత పొంకంగా ఉన్నది!

పూచిన పొన్నచెట్టులాగున అందంగా, ఆకర్షణీయంగా ఉన్నది. నిలువునా చివురించిన గున్నమామిడిలాగున మనిషి నిండుగా ఉన్నది. చెట్టూ పుట్టాలేని మైదానంలో ఒడ్డులు ఒరసికొంటూ సాగిపోతున్నా ఆగిపోయినట్లు కన్పించే నది లాగున గుంభనగా ఉన్నది.

ఆమె దేహాయష్టికి నేను ఆశ్చర్యపడ్డాను. అనుకోకుండా, అయాచితంగా, స్వీయ సౌందర్య ప్రదర్శన మూలకంగా నాకింత ఆనందాన్ని కలిగించింది. నూతనానుభూతిని అందించింది. అప్రయత్నంగా నామనస్సు నింతసేపు పరవళ్ళు తొక్కించింది. ఎవరీమె!

ఎవరూఅంట !

ఎందుకిల్లా వానలో వచ్చింది? ఇదేం తన ఇల్లు అనుకొన్నదా బట్టలు మార్చుకోవడానికి? పైగా తడిచీరా రెవికా ఇక్కడే ఆరవేసుకొంటున్నదే! అరె ఏమిటిదంతా? ఈమె కింత స్వతంత్రం ఎక్కడిదీ?

వర్షంలో ఇల్లు వదలిపెట్టి స్టేషను షెడ్డుకు రావడమేమిటి? వానలో అలా తడవడ మెందుకూ? మళ్ళా అవి మార్చుకోవడ మెందుకూ? అసలీమె నేను నిద్రపోతున్నాననే అనుకొన్నదా కాక నా సంగతి పసిగట్టికూడా నన్ను లెక్క చెయ్యలేదా?

ఎన్నో ప్రశ్నలు. ప్రశ్న పరంపరలు. ఒక ప్రశ్నకు సమాధానం రాకముందే మరో ప్రశ్న.

ఈ పిల్లకు పెళ్ళి అయిందా? వయస్సు ఏమాత్రం ఉంటుందేమిటి? భర్త ఎవరో? భర్త అంటూ ఉంటే ఈమెను ఇల్లా ఒంటరిగా పైగా వానలో బయటకు ఎందుకు పోనిచ్చి ఉంటాడూ? చెప్పకుండా వచ్చేస్తున్నదా?

గుట్టలమీదనుండి క్రిందికి దొర్లివస్తున్న వాగుల్లా ఒకటే ప్రశ్నల రొద. ఇంతలో ఒక మాంచి తెలివైన ప్రశ్న వచ్చింది. "అసలూ ఈ వివరాలన్నీ నీకెందుకూ?" అని. నిజమే నాకెందుకూ?

"ఆమె కన్యా కావచ్చును. కాదూ కాపరం చేస్తున్న కాంతామణి కావచ్చును. ఏదో అర్జంటు పనిమీద స్టేషనుకు వచ్చి ఉండవచ్చును. అయినా నీ కెందుకీ అనవసరపు ఆసక్తి. ఇంకెవ రైనా వింటే నవ్విపోతారు. ఏదో దక్కినంతవరకు ఏమీ కష్టం లేకుండా, దమ్మిడీ వ్యయం కాకుండా, పైగా అయాచి తంగా పరకాంతాదేహ సౌందర్యదర్శనం లభించింది. తప్పో ఒప్పో ఏదో అయిపోయింది. నీ లోపంవల్లగానీ, ఏదో సందర్భ వశానగానీ అనుకోకుండా వ్యవహారం ఇంతదూరం సాగింది. ఇక కట్టిపెట్టు. సమాధానాలకోసం ప్రయత్నంచేసి, సంభా షణలోకి దిగి, అనవసరపు చిక్కుల్లో పడకు." అని ఎవరో గద

మాయించి చెబుతున్నట్లే అనిపించింది. కాని మనస్సు ఊరు కొంటేనా!

మరచిపోక పోవడమే కాకుండా—పైపెచ్చు ఇందాక నేను దర్శించిన దృశ్యాన్నే మరల మరల జ్ఞాపకంచేసి, అనం దపు పొంగు చల్లారనీయకుండా నిలిపి ఉంచుతోంది నామనస్సు. ఆమెకు నా గొడవేమీ పట్టలేదు. జారుముడి వేసుకొన్న కొప్పు విడదీసి అరచేతి అంచులతో, జట్టును కొడుతూ, వేళ్ళతో చిక్కు తీసుకొంటూ నెమ్మదిగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నది.

ఎంత పెద్దజుట్టు! జుట్టు పై చేత్తో అల్లా అన్నప్పుడల్లా గాలి వీచినప్పుడల్లా పరుగులు పెట్టే నీలమేఘ శకలాల్లాగా జుట్టు పాయలు పాయలుగా విడిపోయి చప్పున వీపుమీద పడుతున్నది.

ఆమె నెమ్మదిగా జుట్టు ముడివేసుకొని కుచ్చెళ్ళూ, పమిటా సవరించుకొని, తాపీగా వెళ్ళి ఇనుప కటకటాల దగ్గర నిలబడి అవతల చందుర్ణ్ణి చూస్తూ చాలాసేపు అలా ఉండి పోయింది.

ఆమె నిల్చున్నచోట కొంతమేర వెన్నెల పడుతున్నది. ఆమె వెళ్ళి వెన్నెల్లో నిలబడితే బాగుండు ననిపించింది.

ఆమె అల్లా చాలాసేపు నిల్చున్నది.

ఏదో ఆలోచిస్తున్నట్లు అనిపించింది.

ఏమిటి ఆలోచిస్తున్నగా అని నేను ఆలోచించడం మొదలుపెట్టాను.

"ఏమిటోయ్ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ ?" అంటూ డాక్టరుగారు నెమ్మదిగా భుజంమీద తడుతూ ప్రశ్నించారు.

నేను ఒకసారి ఉలికిపడ్డాను. కొంచెం గాభరాపడ్డాను. "అప్పటి విషయమంతా జ్ఞాపకం చేసుకొంటున్నానండీ" అని చెప్పనా ? ఇంకేమన్నా ఉన్నదీ ? అర్ధరాత్రివేళ పరాయి ఆడదానితో ఒంటరిగా....అని అడిగేయరూ ! పైగా అప్పటి నా పరిస్థితి, ఆ ఏకాంతమూ, నేను దర్శించిన దృశ్యమూ అవన్నీ వరుసగా చెప్పవలసిందేగా ! కేవలం అక్కడిదాకా చెప్పి అంతేనండీ జరిగిందని ఆపివేయడం ఎల్లా ? ఒకవేళ నేను "ఇంతేనండీ" అని చెప్పినా ఆయన నమ్ముతారా ! మరింత అపార్థం చేసుకోరూ ?

"వీల్లేదు. ఆ విషయాలేవీ ఎత్తడానికి ఎంతమాత్రమూ వీల్లేదు" అనుకొని వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాను. ఎల్లాగో అబద్ధాలాడడమంటూ మొదలుపెట్టాను గనుక మరో అబద్ధం కూడా ఆడేస్తే వచ్చిన ప్రమాదమేమీ లేదనే అనుకొన్నాను. అల్లా అనుకొని "అబ్బే, ఏమీలేదండీ. మానవ జీవితంలోని మార్పుల్ని గురించి ఆలోచిస్తున్నానండీ" అని అనేశాను.

“అంతే? ఎవరెవరి జీవితగాథల్ని ఆధారంగా చేసుకొని ఆలోచిస్తున్నావూ?” అని అడిగా రాయన.

“అబ్బే! ఎక్కడిదాకానో ఎందుకూ నా జీవితాన్నే తీసుకొని జరిగిపోయిన కాలం, వచ్చిన పరిణామాలూ, కలిగిన అనుభవాలూ — వీటిని ఒక క్రమంలో జ్ఞాపకం చేసుకొని పరిశీలిస్తున్నాను” అని నిజంగా ఆపనే చేస్తున్నవాడిలా నమ్మకంగా చెప్పేశాను.

ఆయన నమ్మారు. నమ్మి “మంచిది. అల్లా చేయడం ఎంతో ఉత్తమమైనది. నువ్వు మంచి ఆలోచనామార్గంలో పడ్డావు. నీకు అడ్డురాను. నాకూ లోపల కొంచెం పని ఉన్నది. చిన్న ఆపరేషను ఒకటున్నది. పూర్తిచేసి వస్తాను. ఆ తర్వాత తీరిగ్గా మాటాడుకొందాము. ఈ పూట ఉంటావు గదా. మరి వస్తాను” అంటూ గుమ్మం వైపు తిరిగారు. “అవును ఆలస్యంచేస్తే మా క్రొత్త నర్సు అల్లరి పెట్టేస్తుంది” అన్నా రాయన.

“ఆవి డెవరండోయ్?” అనేశాను.

“అవు నవును. ఆవిణ్ణి గురించి కూడా చెబుతాను. తన్ను తాను ఎల్లా ఉద్ధరించుకొన్నదో .... నీకా వివరాలన్నీ చెబుతాను. ఇప్పుడు నీ వాలోచిస్తున్న జీవితపరిణామాలు అన్న విషయానికి ఈమె గాథ కూడా నీకు కొంత ఉపకరిస్తుంది....” అని ఇంకా ఏమో మాటాడదామని అనుకొని

కూడా అవతల అడుగుల చప్పుడు విని ఆయన వెంటనే లోప లకు వెళ్ళిపోయారు.

ఇంక కొంచెంసేపు ఉండి డాక్టరుగారు నా కామె విష యాలు చెప్పి వెళితే బాగుండు ననిపించింది.

క్రొత్త నర్సట!

ఆయా కూడా కాదు. ఏకంగా నర్సే.

మాట ఎంతమారిందీ— ఆ పడుచేనా ఈ నర్సు? కాక పోతే ఆ గొంతు అంతలా ఆ వ్యక్తి గొంతును పోలి ఉంటుందీ?

అప్పుడే గనుక నేనామెను అసలు పల్కరింపకుండానే ఉంటే?.... ఆమెను గురించే ఎన్నో ఆలోచనలు వెన్నెల వాగుల్లావచ్చి నా మనస్సంతా ఆక్రమించాయి.

నా మనస్సొక జ్యోత్స్నా కాసార మయ్యింది.

అందులో ఆమె రూపమే ప్రతిబింబించింది. చాలాసేపు దాకా కదలకుండా చంద్రుణ్ణి చూస్తూ నిలబడ్డ ఆమె అల్లాగే నాకు స్ఫురణకు వచ్చింది.

*　　*　　*　　*

ఆమె అల్లా నిలబడినంతసేపూ నేను ఆమె ఏమిటాలో చిస్తున్నదా అని పరిపరివిధాల ఆలోచించాను.

కొంతసేపయ్యాక ఆమె నాదగ్గరకు వచ్చి నన్ను మాటా డిస్తే బాగుండు ననిపించింది. “అవును ఇప్పుడప్పుడే రైలేమో రాదయ్యె. ఈ నూతన సంఘటన కారణంగా నిద్రరాకపోయె. మరో మనిషి తోడు లభింపకపోయె. కన్పించిన ఆ ఒక్క

మనిషి అల్లా దూరంగా, బొమ్మలా నిలబడకపోతే వచ్చి మాటాడిస్తేనన్నా బాగుండు—కాస్త పొద్దుపోతుంది" అనుకొన్నాను ఒకటి రెండు సార్లు.

కాని ఎంతసేపటికీ ఆమె కదల్లేదు, చివరకు నేనే కదిలాను. అప్పుడే నిద్రనుండి లేచిన వాణ్ణిలా లేచికూర్చుని ఒళ్ళు విరుచుకొని, ఆవులించి, కళ్ళు నలుపుకొని. వేళ్ళు విరుచుకొని, ఆమెవైపు కొంచెం కొత్తగా చూస్తున్నట్లుగా చూస్తూ "ఎవరది ?" అన్నాను.

"ఎవర్లేదు లెండి" అన్నదామె. ఆ తర్వాత ఇంకేం మాటాడాలో స్ఫురించలేదు. పరాయిస్త్రీతో, అంత రాత్రి సమయంలో, అందులోనూ అలా ఒంటరిగా ఉన్నప్పుడు చొరవ చేసుకొని ఏం మాటాడాలి ? ఆమె కనుక తగవులమారిదైతే ఏమాట అన్నా తగూ వచ్చితీరుతుంది—అదొక భయం.

కాని ధైర్యంచేసి చివరకు "ఇక్కడెక్కడయినా కుళాయి ఉన్నదా ?" అని అడిగాను. ఆ మాటకు ఆమె నెమ్మదిగా నా ముందుకు వచ్చి "ఏం, అప్పుడే తెల్లారిం దనుకొన్నారా ఏంటి ?" అన్నది.

"అబ్బే లేదుగాని...."

"అయితే మరి బయట ఆ వారసన వాన పడుతుంటే మీకు దాహం అయిందా ?"

"అవదూ? వానకూ, దాహానికీ ఏమిటి సంబంధం? పైగా భోజనం అదీ చెయ్యకుండా ఉన్నానయ్యో!" అన్నాను.

"ఏం? ఎందుకు చెయ్యాలా? మీలాటి మహారాజులకు హోటేళ్ళు ఉన్నాయిగా?" అని ఆమె అడిగిందే చాలని స్వవిషయమంతా టూకీగా చెప్పేశాను.

ఆమె అంతా విని "అయ్యో పాపం! అల్లాగేం! పోనీ నాదగ్గర అరటిపళ్ళున్నాయి. ఇస్తానుండండి" అన్నది.

ఆ పూట ఎప్పుడో ఆరు గంటలకు హోటల్లో ఫలహారం తిని కాఫీ తాగాను. 10 గంటలదాకా ప్రయాణమే సరిపోయె. అప్పటినుండి తిరుగు ప్రయాణం విషయమే. ఇక భోజనం విషయం ఆలోచించిం దెప్పుడు! కాని ఆమె ఈ విషయం ఎత్తి అరటిపళ్ళు తెస్తాననప్పుడు నాకు నిజంగానే ఆకలి వేస్తున్న దనిపించింది.

ఆమె వెనక్కు తిరిగి తన పెట్టె దగ్గరకు వెళ్ళింది. పళ్ళు చేతికిస్తున్నప్పుడు వ్రేళ్ళు తగలకపోతాయా అని ముందుగానే ఒక ఊహ—ఒక ఆశ.

వ్రేళ్ళు తగలడం—నిజానికి ఎంత చిన్నవిషయం? కాని ఎందుకో నన్నంతగా కలతపెట్టింది. ఆమె ఒక్క క్షణంలో వచ్చేస్తే బాగుండు ననిపించింది.

ఏమిటో ఈ ఆకర్షణ?

ఎందుకో ఈ ఆసక్తి?

"నిజమే. మనిషిని అపవిత్రత ఆకర్షించినంతగా — నియమానికి విరుద్ధంగా ఉన్న విషయం ఆకర్షించినంతగా, మరొకటి ఆకర్షించదు. హృదయాన్ని కవ్వించదు." అనుకొన్నాను.

"పరాయిది అనేసరికి ఎంత ఆర్భాటం! ఎంత ఆరాటం! ఏమిటిది?" అని ఇలా నేను ఆలోచనలో పడి తర్కించుకొంటూ ఉండగా ఆమె తిరిగి వచ్చింది. పొంకంగా నా కెదురుగ్గా నిల్చొని "నిజంగా మీరు అన్నం తినలేదా?" అని అడిగింది. ఎందుకు అడుగుతున్నదో అర్థం కాకపోయినా వెంటనే అవునని అనేశాను.

ఆమె నా ముఖంలోకి చూచింది.

ఆ చూపులో ఎంత సానుభూతి! పరాయి వాణ్ణి నా ఆకల్ని గురించి ఆమెకు ఎందుకింత సానుభూతి కలిగిందా అని అనుకొంటూ నేను కాస్త ధైర్యంగా ఆమె ముఖంలోకి చూచాను.

ఆ ముఖంలో అమాయకత్వం కన్పించింది. ఆమె కన్నులలో ఏదో క్రొత్తదనం కన్పించింది. వినువీథుల్లో, వెన్నెలలో తేలియాడుతున్న నీలమేఘశకలాల్లాగా ఆమె కన్నులు అందంగా ఉన్నాయి. స్వచ్ఛాకాశంలా, అమాయకంగా ఉన్న ఆమె ముఖానికి ఆ కన్నులు క్రొత్త ఆకర్షణను సమకూర్చాయి.

ఆమె చామనచాయే కావచ్చును కాని ఆ వయస్సూ, అమాయకంగా కన్పించే ఆ ముఖమూ, ఏదో వింతగా మెరుస్తు న్నట్లుగా ఉన్న ఆ కన్నులూ ఆమెకు మరింత ఆకర్షణ చేకూర్చినాయి.

ఆమెవచ్చి పళ్ళు ఇచ్చింది. కాని వ్రేళ్ళుమాత్రం తగల నీయలేదు. ఈ విషయంలో తను ముందుగా జాగ్రత్త తీసు కొన్నట్లున్నది. "ఈ పళ్ళు నాకేమీ అక్కర్లేదు. నువ్వే పట్టుకువెళ్ళు" అందామని అనిపించింది నాకు. మనస్సులో అంత కోపం వచ్చింది.

"తినండి" కొంచెం గదమాయించినట్లు అన్నది.

"ఆ ఆ. అయినా అంత మరీ ఆకలి వెయ్యడంలేదు." అని నసిగాను.

"అబద్ధా లెందుకాడుతారులెండి—తినండి."

"ఎంత ఇవి?" వెనకాముందూ ఆలోచించుకోకుండా ఏదో పిచ్చిప్రశ్న వేశాను.

"ఎంతో అంత—ఏం డబ్బులిస్తారా?" అని క్షణమాగి మరుక్షణంలో పకపకా నవ్వేసింది.

సరోవరంలోని కలువలన్నీ అలా ఒక్కసారి గప్పున విక సించినట్లయ్యింది.

పసిపిల్ల కిలకిలా నవ్వినప్పుడు పాలపళ్ళ తెల్లని కాంతులు పరువులెత్తినట్లయ్యింది. కాని ఎందుకో ఆమె అంత లోనే ముఖం ముడుచుకొన్నది. కోపగించుకొన్నది.

"రెండరటిపళ్ళుచ్చుకొని డబ్బులిస్తారేం! పళ్ళు అమ్ముకొనే దాన్ననుకొన్నారా? అకలవుతుందంటే పళ్ళిస్తే — నేను మంచిదాన్ని కాకపోతే పోనీ — మీ పెద్దమనిషితరహా ఇదేనా" అని అంటూ తగవుకు సిద్ధమైంది. ఎంతో నొచ్చుకొన్నది. నేను గొప్ప చిక్కులోనే పడ్డాను.

"అన్నం తిన్నానన్నా పొయ్యేది. అసలు పల్కరించకుండా ఉన్నా పొయ్యేది." అనుకొన్నాను. మొదట కొంత సేపు. ఆమెకు నెమ్మదిగా "నా ఉద్దేశం అదికాదు" అని నచ్చ చెప్పవలసి వచ్చింది.

నాకే తెలియకుండా రంగప్రివేశం ఎల్లాగా అని దురాలోచన చేస్తున్న నా మనస్సుకు ఈ పరిస్థితి కొంత బాధ కలిగించింది. నేను కొంతదూరం నచ్చచెప్పాను.

కాని ఆమెకు రోషం తగ్గలేదు. నేను కొంతసేపు ఆమె వంకే చూస్తూ కూర్చుండిపొయ్యాను.

"మరేమీ లేకపోతే ఇంకా కూర్చున్నారేం తినక" అని కాస్త గొంతు పెద్దది చేసింది. నేను చప్పున రెండు మూడు పళ్ళు తినేశాను. అవి అంత బాగుండలేదు. అందుకని ఆగాను. మళ్ళీ. నేను ఆగిపోవడం చూచి ఆమె చరచరా ముందుకువచ్చి

ధైర్యంగా నా చెయ్యి పట్టుకొని బలవంతాన మిగిలినవి తిని పించేసింది. మనస్సు సంగతి దేవుడెరుగు—శరీరస్థితి ఎలా అయి పోయిందో !

చప్పున దగ్గరకు లాక్కొందామని అనిపించింది. అంత ఆవేశం వచ్చింది. మెరపులా ఒక్క క్షణంలో జరిగిపోవలసిందే. ఒక మేఘం పైనుండి మరో మేఘంపైకి మెరుపు దుమకడానికి ఎంతోసేపు పట్టదు. పర్వతశిఖరం అంచుదాకా వచ్చిన మహాప్రవాహానికి క్రిందకు దూకడానికి ఎంతోసేపు పట్టదు.

ఈ విషయంలోనూ అంతే.

ఆ పని ఆతురాలా జరిగిపొయ్యేదే.

కాని ఎందుకో ఆమె నా కళ్ళల్లోకి ఒక్కసారి అల్లా విచిత్రంగా, లోతుగా చూచి, చప్పున దూరంగా జరిగి పోయింది.

దూరంగా నిలబడి తనూ కాస్త నిలువదొక్కుకుంటు న్నది కాబోలు, తడబడుతూ "నీళ్ళుకూడా తెచ్చిమ్మంటారా దాహం వేస్తున్నదంటిరి గదా ?" అని అడిగింది మరోవైపు చూస్తూ. నేను ఎందుకో కొంచెం వణుకుతున్నాను. అవసరం లేదని అతికష్టంమీద అన్నాను. ఒకటి రెండు నిముషాలు మాకు ఇరువురకూ తెలియకుండానే గడచిపొయ్యాయి.

"నువ్వు భోజనం చేశావా ?" అని ఊరికే యథాలాపంగా అడిగాను. తెగిన సంభాషణను ఏదోవిధంగా మళ్ళీ కొనసాగిద్దామన్న ఉద్దేశ్యంతో.

"నేను ఈ పూట ఏంటి — మధ్యాహ్నం కూడా తినలా—అయితే ఏం పర్వాలేదులెండి. నా కలవాటే" అన్నది.

ఆ చెప్పడం ఎంతో అమాయకంగా చెప్పింది. నాకు నిజంగా జాలివేసింది.

తను మధ్యాహ్నం భోజనం చేయకుండా ఉండికూడా రాత్రికి ఈ అరటిపండ్లు తిని నిద్రపోదామనుకొన్న మనిషి పరాయివాడి ఆకలి విషయం కనుక్కొని అవికాస్తా దానం చేస్తుందా ? ఏమిటీ ఔదార్యం ?

ఇంతవరదాకా ఆ వ్యక్తి బాహ్యరూపాన్ని చూచి ఇల్లా ప్రవర్తింపగలదని నేనూహించుకోలేదు. న్యాయానికి కడుపు నిండిన తర్వాతనే ఇతరుల విషయాలూ, ఇతర విషయాలూ. ఇల్లాంటి త్యాగాలూ అవీ ఎవరో మహోదాత్తులు చేయవలసినవే కాని సామాన్యులు చేసేవి కాదు. ఎందుకు చేసిందిల్లా ?

ఏమిటీ భరోసా !

ఏమి ఉద్దేశించి చేసింది ?

"నాలానే తనకూ దురుద్దేశమే ఉంటే ఇందాక అల్లా దూరంగా ఎందుకు వెళ్ళిపోయిందీ ?" నాకాలోచన తెగలేదు.

ముందామె సంగతి కొంతయినా తెలుసుకొందామని ఆసక్తి కలిగింది. అల్లాగయినా ఆమెను తిరిగి సంభాషణలోకి దింపవచ్చుననీ, పైగా ఈ ఆలస్యంవలన పుట్టి మునిగిపొయ్యే దేమీలేదనీ, అదీకాక త్వరపడడ మనేది ఒట్టి మొరటుతనమనీ అనిపించింది. "వాతావరణంలో పెద్ద అననుకూల్యమూ లేదు, హఠాత్తుగా మార్పురాగల సూచనలూ లేవు. మరో విషయం- ఆమె ఏం మహాపతివ్రత కాదు. ఇటు నేనేం బ్రహ్మచారినీ కాదు. అంచక్కా పదేళ్ళ సంసార జీవితానుభవం కలవాణ్ణి." ఇల్లా భావనచేసి ఆమెను దగ్గరకు రమ్మని నెమ్మదిగా పిల్చాను. ఆమె దగ్గరకు వచ్చాక "ఏం ఎందుకు తినలా ఇంట్లో ఎవరిమీదైనా అలిగావా?" అని అడిగాను.

"ఏంటీ"

నేను మళ్ళీ అడిగాను సానుభూతి కన్పరుస్తూ. నాకు నిజంగా సానుభూతి కలిగిందనుకొన్నదో, కాక ఏ స్వభావాన ఉన్నదో ఏమో, వచ్చి నా కాళ్ళ దగ్గరగా క్రింద కూర్చుని "ఇంటిదగ్గర మరెవ్వరున్నారూ?" అన్నది.

"అంటే?"

"అంటే ఏంటి? అంత ఇచిత్రంగా అడుగుతారేం!"

"విచిత్రంగా అడగడ మేమున్నదీ? తల్లీ తండ్రీ — భర్తా....ఎవరిమీద అలిగివచ్చావో, అని అడిగాను."

"ఎవర్లేందే—ఎవరిమీద అలుగుతాను ?"

"అరే—లేకపోవడమేమిటి ?"

"అంత ఇవరంగా అడుగుతున్నారే – మీరేం పోలీసు పనేమైనా చేస్తున్నారా ఏమిటి ?"

"అబ్బే కాదు — అయినా చెప్పకూడనిదైతే చెప్పొద్దులే" అన్నాను.

"పెద్ద దాపరికాలేమున్నాయి ? అంత మీకు వినాలని ఉంటే చెప్తాను" అని తన విషయం చెప్పడం మొదలుపెట్టింది.

పెండ్లయిన రెండేళ్ళదాకా తన మొగుడు చేస్తున్న ఉద్యోగ మేమిటో తనకు గానీ, తన తండ్రికి గానీ తెలియదట. కులంవాళ్ళంతా ముతకపంచలు ఎగగట్టి కూలికి వెళుతుంటే అల్లుడు పైజామాలూ, షరాయీ వేసి బస్తీకిపోయి రావటం చూచి ఏమో అనుకొని మురిసిపోయాడట తన తండ్రి.

కాని తీరా చూస్తే తార్పుగాడి పని.

ఆ పని మానేయమని తను చెప్పినా, తండ్రి కాళ్ళా వేళ్ళా బడి బ్రతిమిలాడినా అతగాడు వినలేదట. పైగా "ఇందులో మాత్రం ఎంత ఒడుపు కావాలీ—మరొకర్ని చెయ్యమనండి చూద్దాం" — అనేవాడట. రెండుచేతులా డబ్బు సంపాదించేవాడట.

ఇంట్లో కావలసినవన్నీ కొనితెచ్చి పడేస్తూ దర్జాగా గడిపేవాడట. కొద్ది కాలంలోనే ఒక చిన్న స్థలంకొని

అందులో ఒంటి నిటారియిపాక వేయించి నువ్వు సుఖంగా బ్రతకడమే నాకు కావల్సింది. నా వృత్తికి మాత్రం అడ్డు రావద్దు అనేవాడట తనతో.

ఆనాటి కానాడు అతని పోకిరీ వ్యవహారం శృతిమించి పోయిందట. మోతుబరి అసాముల ఇళ్ళల్లోనుండి వయసు పిల్లల్ని రెండోకంటికి తెలియకుండా బస్తీకి చేర్చి విటుల కప్ప గించి ఇద్దరి దగ్గరా డబ్బు గుంజేవాడట. తాను అడ్డం వచ్చి నప్పుడల్లా దెబ్బలు తినేదట.

ఒక్కొక్క విషయమే నెమ్మదిగా చెప్పుకొని పోయింది. "పోనీ డబ్బు కూడుతున్నది. పాడిగేదెల్ని కొన్నాడు. సంసారం గడుస్తున్నది. ఇతగాడు కొన్నాళ్ళకయినా బాగు పడక పోతాడా" అనుకొంటూ భావిజీవితాన్ని గురించి తాను ఎలా కలలు కన్నదీ చెప్పుకొనిపోయింది.

"కాని నే నేం అనుకొంటే ఏంలాభం — పెళ్ళయిన నాలుగేళ్ళకే — సానికొంపలో ఆడుఖూనీ అయిపోయాడు" అనిచెప్పి బోళ్ళున ఏడ్చింది. నేను కొంత ఓదార్చాను.

ఓదారుస్తూనే "పోనీ కూడబెట్టిన డబ్బు ఉన్నదిగదా దాంతో..." అని ఆగాను. ఆమె అందుకుని "కాని అది న్యాయంగా వొచ్చిందయితేనా ! అక్కడ ఖూనీ కాగానే వాళ్ళే మాయింటికి వచ్చి ఉన్నమట్టుకు దోచుకొనిపోయారు.

పోతూపోతూ పాకకు అగ్గిపెట్టిపోయారు" అని మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది.

"ఎప్పుడో అయిపోయిందానికి ఇప్పుడేడుస్తావెందుకు, ఊరుకో." అని నెమ్మదిగా ఓదార్చాను. ఆ తర్వాత సంగతంతా నేను మధ్యమధ్య ప్రశ్నలు వేయకుండానే చెప్పింది.

మొగుడు పోయిన పణ్ణర్థానికి తండ్రి పోయాడట. గతిలేక మునసబుగారింట్లో పనికి కుదిరి ఒళ్ళువంచి పనిచేసి రాత్రిళ్ళు వారి గొడ్లచావిడిలో తలదాచుకొనేదట. అక్కడ పనిలో ఉంటున్న రోజుల్లోనే మునసబుగారి కొడుకుతో స్నేహం కలిసిందట.

అతను మొదట బలవంతంచేసి, తర్వాత కాస్త పెద్ద మొత్తాలుడబ్బుఇచ్చి తన్ను లోబర్చుకొన్నాడట. కాని ఆ వ్యవహారం ఇంట్లో తెలిసేసరికి ఆయనగారు బస్తీకిపోయి మళ్ళీ తన వంక తిరిగి చూడలేదట.

తనకథ చెబుతూ "తప్పు మొదటిసారిగా చెయ్యడమే తప్పు - ఇక ఆ తర్వాత చేసేవన్నీ తప్పులుకావు. దాన్ని అనుసరించి వచ్చేవేకాని మరోటికావు." అంటూ ఒక సిద్ధాంత ప్రతిపాదన చేసింది. తన మొగుడు పెద్ద ఇంటి పిల్లల్ని చెడగొట్టినందుకు తన్ను శిక్షించాలని దేవుడే తనకీ పాడుబుద్ధి పుట్టించి పూర్తిగా తను చెడిపోయేదాకా చూస్తూ ఊరుకొన్నాడని అంటూ విధిని తిట్టిపోసింది. తను కులంచేతకానీ, వృత్తి

చేతకానీ సానిది. కాకపోవడం వలన తనకు ఇల్లాగుకూడా బ్రతుకు గడవడంలేదట. చేతిలో డబ్బులు అయిపోయే దాకా ప్రతిసారీ తను నీతిగానే బ్రతుకుతూ వచ్చిందట. కాని ఒకటి రెండు పూటలు ఉపవాసాలయ్యాక మళ్ళీ ఎవర్నో ఒకర్ని ఆశ్రయించడం, పాతికో పరకో గణించుకోవడమూ మామూలయిపోయిదంట.

సిగ్గు విడిచి ఎన్నో విషయాలు చెప్పింది. తాను టెక్కులు నేర్చుకొన్న విధానం వివరించింది. తను ఎట్లా ఎన్ని సార్లు మోసపోయిందీ చెప్పింది. చెప్పి చెప్పి ఆమె హఠాత్తుగా నా కాళ్ళు పట్టుకొని "మీరు పెద్ద ఇంటివారు. చదువుకొన్న వారిలాగున్నారు. అందరిలా కాదు. మీ కళ్ళల్లో ఏదో కన్పిస్తున్నది. అలవాటులేని పని కెందుకువస్తారు. క్రొత్తవారు అని మొదలే తెలిసిపోయింది. కాకపోతే ఇంతసేపు నన్ను మాట్లాడించిం దెవరు? కూడు తిన్నావా అని అడిగిం దెవరు? ఇంత చెడ్డదాంతో మీకు సావాసం వద్దు-అదోలా చూడకండి. ఈ వెధవ వొళ్ళు భ్రమపెట్టేస్తుంది. వద్దు నాకేదో మంచిదోవ చూపండి - ఇంక నుంచైనా నీతిగా బ్రతుకుతాను. మొట్టమొదటి తప్పు చెయ్యడమే తప్పు చెయ్యడం. అది నాతో వొద్దు - పోనీ నేనెళ్ళిపోతా - నన్ను పోనీయండి" అని ఏడుస్తూ వెళ్ళిపోబోయింది. నేను ఆమె తలపై చేత్తో అదుముతూ కూర్చోమన్నాను. నాకు నిజంగానే జాలివేసింది. ఆమె

మాటలమీద నమ్మకమూ కలిగింది. ఆమె ప్రవర్తన నా మనస్థితినే మార్చింది. అప్పటి నా మనస్థితిని తెలుసుకోనేందుకు కాబోలు ఆమె నా కళ్ళల్లోకి నేరుగా, సూటిగా చూచింది.

ఎంతో గొప్పగా చూచిందామె.

ఆ చూపులో ఏంతో ఆశా, దైన్యమూ కన్పించాయి. "ఈ ఒక్కసారి తప్పుకాచి నాకు ఉరిశిక్ష తప్పించండి" అని వేడుకొంటున్నట్లుగా చూచింది. నాకు అప్పుడు ఒక భావన కలిగింది. ఆ భావన ఎంతో గర్వంతో కూడుకొన్నది. స్వీయ గౌరవాన్ని ఒక్కసారి లక్షరెట్లుగా పెంచేసుకొనే అవకాశం చిక్కినందుకు నా మనస్సు పొంగిపోయింది.

"అవును శతకోటిమానవుల్లో నే నొకణ్ణి. ఇతరుల దృష్టిలోనే కాకుండా తాపీగా ఆలోచించినప్పుడు నా దృష్టిలోనూ నేను అంతే-ఒకా నొకణ్ణి. అట్లా కాకుండా కనీసము ఒక వ్యక్తి దృష్టిలోనైనా నేను అచ్చంగా అత్యుత్తముణ్ణిగా, దైవసమానుణ్ణిగా కన్పించ గలిగితే-అది ఎంత గొప్ప విషయం! ఈ పరిస్థితి అందుకే ఎక్కువ అనుకూలంగా ఉన్నది కనుక దీన్ని అందుకు వినియోగిస్తే - నిజమే" అనుకుంటూ ఆ పద్ధతిలో ఆలోచించాను.

మనస్సు సమాధాన పడ్డది.

ఆమె ఇంకా నా కాళ్ళను ఆనుకొనే ఉన్నది. నా చేయి అప్రయత్నంగా ఆమె తలపైనే ఉండిపోయింది. ఆ సమయంలో

నేను నిజంగా మహా గొప్ప నిగ్రహం కలవాణ్ణి అని అనిపించింది. "ఏదో జీవిత సమస్యలలో, కొంత దారిద్ర్యంలో, కుటుంబ పరిస్థితుల్లో, పైకి రావాలనే కృషిలో, ఆ యా ఇబ్బందుల్లో పడిపోయి ఉండిపోయాను గనుక పూర్వం ఈ రకపు తప్పులు నేను చెయ్యలేదు. అదీకాక అటువంటి సందర్భమే రాలేదు. చూశావా మరి అవకాశం వచ్చినప్పుడు కూడా నిగ్రహం చూపకలిగాను." అని నాకు నేనే చెప్పుకొని ఎంతో సంతోషించాను. అల్లా కలగిన సంతోషాన్ని నిలుపుకొందామని పట్టుదల కలిగింది.

ఆమెకు ఆశ్రియం దొరికేచోటును గురించే ఆలోచిస్తున్నాను. "వానలోపడి ఇక్కడికెందుకు వచ్చావూ?" అని అడిగాను యథాలాపంగా, లోపల ఆమె ముందుసంగతిని గురించే ఆలోచిస్తూ.

"వాన పెద్దదయితే గుడిసె కురుస్తుంది. నిలుచోడానికి చోటుండదు. అందుకని వచ్చా" అని సమాధానం చెప్పింది. మరోక్షణం నిశ్శబ్దంగా ఉండి "ఏం మీకోసమే వచ్చాననుకొన్నారా?" అని ప్రశ్నించింది.

"కాదనుకో" అని మాత్రమే నేను అనగలిగాను.

ఆమె మళ్ళీ ఏదో మాటాడడం మొదలు పెట్టింది. తాను ప్రత్యేకంగా పనిగట్టుకొని ఇక్కడకు రానక్కర్లేదట. వర్షం లేకపోతే వెన్నెల్లో పెద్దయింటి వయసు మనుషులూ

ఎవరో ఒకరు షికారుకని అటు వస్తారట ... ఏదో చెప్పుకొని పోతున్నది.

"నేనూ అలా వచ్చాననుకున్నావా ?"

"కాదుగాని—వలవేస్తే..." అని మొహమంతా పర చుకోబోతున్న చిరునవ్వు మొగ్గను తుంచివేసింది.

"ఏం అంత సులభమనుకొన్నావా ? నా సంగతి నువ్వెరగవు." అన్నాను ధీమాగా.

"కాకపోవచ్చు — కాని — మునుపోసారి మీలాంటి వారొకరు తటస్థపడ్డారు. మొగుడు కొట్టాడు పారిపోతున్నా అని చెప్పేసరికి అయన నా వెంటపడ్డాడు."

"మరి నాకుఅలా ఎందుకు చెప్పలా?" వెధవబుద్ధి ఇంకా డొంకదారే పడుతున్నది. నేను వెంటనే మనస్సును కాస్త అదుపులోకి తెచ్చుకొన్నాను. ఆమె మళ్ళీ మళ్ళీ తనకు మంచి దారి చూపమని ప్రాధేయపడ్డది.

నేనూ అదే ఆలోచిస్తున్నానని సమాధానం చెప్పాను. ఆ సమయంలో నేను నిజంగా ఆ విషయమే ఆలోచిస్తున్నాను.

అనేక మంది పెద్దలు జ్ఞాపకం వచ్చారు.

ఏమైనా ఆవిడను నే నుండేస్థలానికి చాలా దూరంగా పంపాలని అనుకొన్నాను. "ఆమె కాస్త మంచిస్థితిలో నాకు మరోసారి ఇల్లాగే తటస్థపడితే నేను ఇప్పటిలా పట్టుదల చూప గలనన్న నమ్మకం ఏమిటి" అన్న అనుమానంతో అల్లా నిశ్చ

యించుకొన్నాను. అల్లా ఆలోచిస్తుండగా చివరకు డాక్టరు గారి విషయం స్ఫురణకు వచ్చింది. 'ఓ మంచి ఆలోచన' అనుకొని ఉబ్బిపోయాను. 'ఆయనా పెద్దవాడు. రెండు నర్సింగ్ హోము లున్నాయి. మహానగరంలో పెద్ద ప్రాక్టీసు వచ్చింది — పైగా సంస్కరణాభిలాషి — ఆయన ఈమెకు సాయం చేయగలడు. ఇంతకుముందు ఇల్లా కొంత మందికి ఆయన సాయం చేశాడు. ముందేదయినా చిన్న ఆయా పని ఇచ్చి ఆమెను సరిదిద్దగలడు' అనుకొన్నాను.

ఆయనదగ్గరకువెళ్ళి ఎల్లా ఆశ్రియం సంపాదించాలో ఒక పథకం అల్లేశాను. నా ఆలోచన పూర్తి అయ్యాక ఆమె కా విషయం వివరంగా చెప్పాను. ఆమె ఉబ్బి పోయింది.

ముఖ మింతచేసుకొని చిరునవ్వులు చిందించింది. లేచి ఉల్లాసంగా అటూ ఇటూ తిరిగింది. "మీ మేలు మరువను సుమండీ" అని ఎంతో కృతజ్ఞత కనపరచింది. చివరకు "మరె ప్పుడు వెళ్ళడం" అని అడిగింది. "నీ యిష్టం" అన్నాను. "ఎప్పుడో ఏమిటి ఇప్పుడే వెళతాను పంపండి. ఉండండి ఇప్పుడే వస్తాను" అని 'అరెరె వానలో మళ్ళీ ఎక్కడికి' అని నేను అంటున్నా వినిపించుకోకుండా తన పాకవైపు పరుగెత్తింది.

అప్పటికి ఇంకా కొంచెం జల్లు పడుతూనేఉన్నది. ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళిన మనిషి గంటకయినా రాక

పొయ్యేసరికి నా కేటూ తోచక ఊరికే ఆమె వెళ్ళినవైపే చూస్తూ కూర్చుండిపొయ్యాను.

... ... ... ...

"ఏమండీ డాక్టరుగా రున్నారా?" ఎవరో నన్ను ప్రశ్నించారు.

మధుర స్మృతిపథాలలో విహరిస్తున్న నేను సాధారణ స్థితికి వచ్చేసరికి కొంతసేపు పట్టింది.

ఆ వ్యక్తి నన్ను మళ్ళీ అడిగాడు.

"ఉన్నారండీ లోపల ఏదో ఆపరేషన్లో ఉన్నారు."

"సరే లెండి—మా అయ్యగారు కనుక్కొని రమ్మన్నారు. వెళ్ళి చెప్తాను" అంటూ అతను వెళ్ళిపోయాడు. "వీడెవడ్రా అంచక్కా సినిమా చూస్తున్నట్లుగా అప్పటి దృశ్యాలన్నీ స్ఫురణకు వస్తుంటే మధ్యలో ఆటంకం కలిగించాడూ!" అని ఆ వచ్చి వెళ్ళిన వ్యక్తిపై విసుక్కొన్నాను.

ఒకటి రెండు నిముషాలు ఎదురుగా గోడలమీద ఉన్న క్యాలెండర్లవంక చూస్తూ కూర్చున్నాను.

నిజమే ఆనాడు నేను చేసిన ఉపకారం చాలా స్వల్పమైనది అని అనిపించింది. ఒక్క పదిరూపాయలతో అంత మంచిపని చెయ్యగలిగాను కదా అని ఇప్పటికీ సంతోషంగానే ఉన్నది.

"ఒక్క పదిరూపాయలు !" అనుకొన్నాను మళ్ళీ. "అవునవును. ఇప్పుడు పదిరూపాయ లంటే నీకు పెద్ద మొత్తంగా కన్పించడంలేదు కాని అప్పుడో ?" అని ఎవరో ప్రశ్నించినట్లనిపించింది. అల్లా అనిపించడంతో ఒకనాటి నా ఆర్థిక ఇబ్బందుల తాలూకు జ్ఞాపకాలన్నీ వరదవాగుల్లా వచ్చి మనస్సు నంతటినీ కలచివేశాయి. భయం, బాధా కలిగాయి. "పోనీలే అవన్నీ ఇప్పుడెందుకు. ఇప్పుడు దారిలో పడ్డాను కదా !" అని గుండె దిటవుచేసుకొన్నాను. వరదతీసిన తర్వాత ప్రశాంతంగా కనిపించే ప్రవాహంలా నా ఆలోచన ఇక సాఫీగా సాగిపోయింది. కుర్చీని బల్లకు దగ్గరగా లాక్కొని, బల్లపై చేయి ఆనించి, చేతిమీద తల వాల్చుకొని, విశ్రాంతిగా డాక్టరు గారికోసం ఎదురు చూస్తూ ఉండిపోయాను. అప్పు డోక్షణం 'పొరపాటున నా పేరు ఈయనతో చెప్పిందా ఏమిటి ?' అని కొంచెం భయంవేసింది. కాని అంతలో ఆమెను రైల్లో ఎక్కించి నేను ప్లాటుఫారంమీద నిలబడి చెప్పిన విష యాలూ. "అక్కడ చాలా జాగ్రత్తగా ఉండు. ఇబ్బందులు ఏవైనా వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకో. ఒక విషయం మాత్రం ముఖ్యంగా జ్ఞాపకం ఉంచుకో — నీ పూర్వ పరిచితుల్ని ఎవర్నీ కలుసుకోకు. ఒకవేళ ఎవరైనా హఠా త్తుగా కన్పించినా ఏమీ ఎరగనట్లే తప్పించుకొని వెళ్ళు. నేను కన్పించినా అంతేసుమా. అక్కడ డాక్టరుగారితో నా పేరు

పొరపాటునకూడా ఎప్పుడూ చెప్పకు. అసలూ ఎవరి పేర్లూ చెప్పవలసిన పనిలేదు. నీ అంతట నువ్వు వెళ్ళినట్లుగా వెళ్ళు. ఆయన్ను ఆశ్రయించు. ఏ పని యిస్తే ఆ పనిలో మాట్లాడకుండా ప్రవేశించు. స్వయంగా గొప్ప కృషి చెయ్యి. అందుకు ఆయన సర్వవిధాలా తోడ్పడి నిన్ను పైకి తీసుకొని వస్తారు. ఆయన అమృత హృదయులు" అంటూ నేను నిదానంగా దూరం ఆలోచించి చెప్పిన మాటలూ, తీరా రైలుకదిలే వేళకు "ఉన్న ఊరూ, కొంపాగోడూ అన్నీ వొదిలేసిపోతున్నా— అక్కడ ఎల్లా గడుస్తుందో ఏమో!" అంటూ అధైర్య పడిపోయి ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం, 'అదుగో అదే వద్దన్నాను' అంటూ నేను ఓదార్చడం...ఆ దృశ్యాలన్నీ చిత్రంగా స్ఫురణకు వచ్చాయి.

"కనుక ఆ విషయంలో ఏమీ భయపడక్కర్లేదు. అసలు అటువంటి దేమైనా జరిగిఉంటే ఆయనముందే ఆ ప్రసక్తి తెచ్చేవారు" అనుకొన్నాను. "మాటల ధోరణిలో ఎంతో మార్పు కన్పించింది. ఇంక రూపంలో ఎంతమార్పు వచ్చి ఉంటుందో!...కాని ఏమైనా సరే ఆవిడకు కన్పించకుండా వెళ్ళిపోవాలి—అవును నేను ఇందాక తొంగి చూడకపోవడం చాలా మంచిదయింది" అనుకొని అందుకు నన్ను నేను అభినందించుకొన్నాను.

కొంచెం గర్వపడ్డాను కూడానూ.

'చూచావా మరి నేనుకూడా మంచి తెలివికలవాణ్ణి అవుతున్నాను' అనికూడా అనుకొన్నాను.

ఇంతలో చాలా దగ్గరగా, నెమ్మదిగా ఏదో యథాలాపంగా అంటున్నట్లుగా అంటున్న మాటలు. "ఏమండీ మిమ్మల్ని డాక్టరుగారు ఉండమన్నారు. వస్తున్నానని చెప్పమన్నారు" అంటున్న మాటలు విన్పించాయి.

నేను తలఎత్తి చూచాను.

ఆమె నావంక చూడడంలేదు. బల్లమీద ఉన్న మందు చీటీల కట్టలు తీసి ఏ చీటీకోసమో వెదుకుతున్నది.

ఆ మనిషికి మంచిఛాయ వచ్చింది. ఏంతో ఆరోగ్యంగా, అందంగా, ఇటీవలనే కాపరానికి వెళ్ళి పండుగకు పుట్టింటికి వచ్చిన పడుచులా ఉన్నది. జాగర్లమూడి తమలపుటాకులా ఆమె చెక్కిళ్ళు లేతగా నవనవలు కూర్చుకొన్నవిగా ఉన్నాయి. తెల్లటి దుస్తులు వేసుకొన్నది. కొంత బస్తీపోకడ కూడా అలవడింది.

ఆమెలో వచ్చిన మార్పు నన్ను అమితాశ్చర్య చకితుణ్ణి చేసింది. ఆమె తన పనిలో నిమగ్నమయ్యే "ఆపరేషను

అయిపోయింది, వస్తున్నాన్లెండి" అన్నది, అని ఎదుటివ్యక్తి తన వంక అదేపనిగా చూస్తున్నట్లు అనుమానపడి కాబోలు తనూ తలఎత్తి నావంక చూచింది. కాదు నా ముఖంలోకి — నా కళ్ళలోకి — కాదు నా హృదయంలోకి చూచింది. అంతలో లేతగులాబీ రేకుల్లా ఉన్న ఆమె పెదిమలు ఎందుకో అదురు తున్నాయి. ఒక్క క్షణంలో నన్ను గుర్తుపట్టేసింది. "అరె మీరటండీ" అనేసింది.

నేను ఎప్పుడు లేచి నిల్చున్నానో నాకే తెలియదు. ఎందుకో చెప్పలేని ఆనందం, ఆవేశం - అధైర్యం, ఆరాటం. ఇరుపక్కలా పట్టుకొని నన్ను ఊపివేశాయి. వెనుకటి విషయమంతా మెరుపుల వరుసలా జ్ఞాపకం వచ్చింది. అంతలో ఆ మెరుపులు మాయమయ్యాయి. నాకేమీ తోచలేదు. తిక మక పడిపోయాను. నేను చప్పున వెనక్కు తిరిగాను.

ఏమో అందామని, ఏమో చెప్పాలని అనుకొన్నానే గాని ఒక్క మాటైనా నోట్లోంచి పెకిలిరాకముందే వీధి గుమ్మం ఇవతలకు వచ్చేశాను. డాక్టరుగారి డిస్పెన్సరీ పది గజాల దూరంలో ఉన్న బస్సుస్టాపులో అప్పుడే ఒక బస్సువచ్చి ఆగింది. ఒక్క పరుగున వెళ్ళిఅందులో ఎక్కేశాను. "నీ తెలివి తెల్లవారినట్లే ఉన్నది. అది డాక్టరుగారి డిస్పెన్సరీ కదా పోనీ

వార్ని కలుసుకోవాలని అంత అనిపించినప్పుడు ఇంటికి వెళ్ళితే పొయ్యేదిగా — అప్పుడు నువ్వు అనుకొన్నట్లుగా సరిగ్గా నర్సింగ్ హోములోనే పనిచేస్తున్నదని ఎందుకనుకోవాలి? అయితేమాత్రం ఇంత అధైర్యమెందుకూ—అరెరె—ఏమిటిది గుండె ఇంత వేగంగా కొట్టుకుంటున్నది?" అని నన్ను నేనే ప్రశ్నించుకొంటూ జరిగిన విషయం మర్చిపోదామన్న ప్రయత్నంలో కళ్ళు గట్టిగా మూసుకొన్నాను.

బస్సు దూరదూరంగా పరుగెత్తుకొని పోయింది.

